ప్రజాశక్తి

శనివారం 15 ఫిబ్రవరి 2025 8 పేజీలు




శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు







మాట్లాడుతున్ననాయకులు

రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-నెల్లూరు:రవాణా రంగంలో వస్తున్న మార్పుల దృష్ట్యా రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులపై 2019 నుండి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం రకరకాల పద్ధతిలో మోటర్ వాహన చట్ట సవరణ బిల్లును అమలు చేస్తూ ఆర్థిక భారాలు మోపుతున్నది అంతేకాకుండా ఈ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ కార్పోరేట్ వ్యక్తులకు అప్పగించే పనిలో పూర్తిగా నిమగ్నమై ఉందని ఆటో జిల్లాకార్మిక సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆటో కార్మిక సంఘం సమావేశం ఎం వి రాజా అధ్యక్షతన జిల్లా సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్ పాల్గొని మాట్లాడుతూ మార్చి 24వ తేదీ రవాణా రంగాన్ని కాపాడుకుందాం కార్మిక హక్కులను రక్షించుకుందాం అనే నినాదంతో రవాణా రంగంలో ఉండే కార్మికులందరూ ఢిల్లీ పార్లమెంట్ ని దిగ్బంధించే విధంగా చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు ఇచ్చింది కాబట్టి కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఆదేవిధంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ , ఆటో కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు టివి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఈ జిల్లాలో ఆటో కార్మిక సంఘం బలమైన రంగంగా కార్మికులకు అండగా పనిచేస్తుందన్నారు ఆటో కార్మిక సంఘం జిల్లా నాయకులు కొర్ర హరి, కొట్టె వెంకయ్య, కందుకూరు పట్టణ అధ్యక్షులు నరసింహులు, రామిరెడ్డి, మనోహార్, దయా సాగర్, పరశురామ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా లేని కేంద్ర బడ్జెట్

-రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షపార్టీలు



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

పార్లమెంట్‌లో ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, పెత్తందార్లకు లాభం చేకూరే విధంగా ఉందని, ప్రజారం జకంగా లేదని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో 'ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ని తిరస్కరించండి' అని అంటూ వామపక్షపార్టీలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా అంకయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు అనుకూలంగా లేదన్నారు. ఈ బడ్జెట్ వల్ల కలిగే నష్టాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు జాతీయ స్థాయిలో దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమా లను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నగరంలో ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల ఒకటవ తేదీన పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు , పెద్దవారికి, పెత్తందార్లకు ఉపయోగపడే విధంగా ఉందే తప్ప సామాన్య, మధ్యతరగతి ప్రజలకు లాభం చేకూరే విధంగా ఏమాత్రమూ లేదన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఫార్వాడ్ బ్లాక్ వంటి పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఇప్పటికే జరుగుతున్నా యన్నారు. ఉపాధి హామీ పథకం గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు లబ్ధిపొందేవారని, అందుకు గాను రూ.85 వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిగేవన్నారు. అయినప్పటికీ ఈ పథకంలో పనిచేసేన వారికి ప్రభుత్వం కూలీలు చెల్లించకపోవడంతో వేతన బకాయిలున్నాయన్నారు. ఈ బకాయిలు కోసం, 200 రోజులు పని కల్పించాలని, రూ. 500 రోజువారీ వేతనంగా అందజేయాలని కార్మికులు దశల వారీగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ సమస్యపై నేటికీ కేంద్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపకపోగా ఉపాధి హామీ పథకం ఉన్న లొసుగులను ఉపయోగించుకొని బడ్జెట్ కేటాయింపు తగ్గించడాన్ని వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తు న్నాయన్నారు. ఐసిడిఎస్ లో సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు వేతనాలు అందజేసేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపు పెంపుదల చేసేందుకు ఎటువంటి ఆలోచన చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే అంగన్‌వాడీల శ్రమకు తగిన విధంగా వేతనాలు అందజేయడం సాధ్యమవు తుంద న్నారు. ఎస్‌సి,ఎస్‌టి మహిళల అభ్యున్నతికి కేంద్రం కేటాయించాల్సిన నిధులు కేటాయించలే దన్నారు. విద్య, వైద్య రంగాల అభ్యున్నతికి అవసరమైన మేర నిధులు కేటాయింపు బడ్జెట్‌లో పేర్కొనలేదన్నారు. జిడిపిలో 6 శాతం అయినా కేటాయింపు జరగలేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను వామపక్షపార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కలిసి వచ్చే రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని రాబోవు కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ కేంద్రం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఒకలక్షా డెబ్బయి తొమ్మిది కోట్లు నిధులు కేటాయించామని ,ఈ నిధులతో గ్రామీణప్రాంతాలు అభివృద్ధివైపు పరుగులు తీస్తున్నాయని ప్రకటించడం దారుణమన్నారు. గతంలో ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపు నిధుల కంటే 35 వేల కోట్లు కోత విధించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తాము కృషి చేస్తున్నామని బిజెపి ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రైతాంగం వ్యవసాయం చేయాలన్న ఆలోచన విరమించుకొనే పరిస్థితి ఏర్పడుతుం దన్నారు. దేశాభివృద్ధి ఒక్క వ్యవసాయ రంగంతోనే సాధ్యమవుతుం దన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడం వల్లనే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుం దన్నారు.ఇవన్నీ జరగటం వల్లనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు షేక్. రెహానాబేగం మాట్లాడుతూ ఉపాధి అవకాశాలకు దెబ్బకలిగే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్య రక్షణకు దోహదపడే ఐసిడిఎస్ రంగానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోత విధించడం సరైన చర్యలు కాదన్నారు.సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి. రాంబాబు మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఎంతో కీలకమైన రంగాలైన కార్మిక, రైతులకు ఎటువంటి మేలు జరగని విధంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు.ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు ఉపయోగపడే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు.కేవలం రూ.12 లక్షల వరకు ఇన్‌కమ్ ట్యాక్స్‌రాయితీ కల్పించే అవకాశం కల్పించనట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించింది. దీని వల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలకు పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. కార్మికులకు, రైతాంగానికి వ్యతిరేకమైన కేంద్ర బడ్జెట్‌ను వామపక్షపార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఆల్ ఇండియా ఫార్వాడ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు మేలు చేసే విధంగా లేదన్నారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్షపార్టీలు పోరాటం చేసేందుకు సిద్ధమౌతు న్నాయని, అందుకు ఆల్ ఇండియా ఫార్వాడ్ బ్లాక్ నుంచి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కత్తి శ్రీనివాసులు, జి. నాగేశ్వరరావు, నాయకులు పి. సూర్యనారాయణ, కొండా ప్రసాద్ , బీపీ నరసింహ, సిపిఐ నాయకులు ఆంజనేయులు, శంకర్ కిషోర్, టైలర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఎం సారూ..స్వచ్ఛ'ఆంధ్ర' ఎక్కడ..?

- దోమలతో జనం సహజీవనం
- విషజ్వరాలతో జనం సతమతం
- యుద్ధం అన్నారు..ఆయుధాలు ఎక్కడ పెట్టారు
- దోమల నివారణకు ప్రజలు వందల కోట్లు ఖర్చు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ నుంచి మంచి మంచి ఆలోచనలు వస్తాయి... అమలుచేయడానికి హడావుడి చేస్తారు... ఫలితాలు మాత్రం అంతంత మాత్రమేననే విమర్శలున్నాయి.. స్వచ్ఛ భారత్...స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛ నెల్లూరు అంటూ అప్పుడు, ఇప్పుడు ఏదో చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. జనంలో ఏదొక కార్యక్రమం తీసుకొస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఎక్కడా స్వచ్ఛత కనిపిం చడం లేదు. పారిశుధ్య కార్మికు లు రోజువారి పనులు చేస్తున్నా ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతు న్నాయి.. జిల్లా వ్యాపితంగా కొద్ది నెలలుగా విషజ్వరాలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ఆస్పత్రులకు సుమారు రూ.500 కోట్లు ఖర్చుపెడితే దోమల నుంచి రక్షించుకోడానికి మరో రూ.200 కోట్లు ఏడాదికి ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వం పారిశుధ్య నిర్మూలనకు రూ.100 కోట్లు ఖర్చుపెడుతున్నారు. దోమల పై యుద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రకటించి, ఆయుధాలు పక్కన పడేస్తే, అవి జిల్లాపై దండయాత్ర చేస్తున్నాయి.. వాస్తవ పరిస్థితులు గుర్తించి దోమల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. సచ్ఛభారత్ కార్యక్రమంలో నేడు కందుకూరులో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు.



సిఎం చంద్రబాబునాయుడు

నెల్లూరు జిల్లా వ్యాపితంగా విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఆర్నెల్ల నుంచి ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇప్పుడు ప్రధాన పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు జ్వర పీడితులతో ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబర్, నవంబర్‌లలో వర్షాలు వచ్చే సమయంలో దోమలు పుట్టుక ప్రారంభమవుతుంది. ఆ మాసాల్లో జ్వరాలు సీజనల్‌గా వచ్చేవి. ఈసమయంలో అధికారులు కొంత దోమల నివారణ చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు పరిస్థితులు రాను రాను మారిపోతున్నాయి. ఏడాదంతా దోమలు, జ్వరాలు, రోగాలతో జనం సతమతమవుతున్నారు. నెల్లూరు నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ప్లాస్టిక్ వాడకం అధికం కావడంతో పెద్ద పెద్ద డ్రైనేజీ కాలువల ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతున్నాయి. నీరు బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. నగరంలో సైడ్ కాలువల నిర్మాణం చేయకుండా 2015లో టిడిపి ప్రభుత్వం సిమెంట్ రోడ్ల నిర్మాణం చేసింది. అనేక ప్రాంతాల్లో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో సైడ్‌కాలువలు లేకుండా ఎక్కడ మురుగు అక్కడే ఉంటుంది. ఇది దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమలు పుట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. సాయంత్రం పాగింగ్ చేయడం, కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, గుంటల్లో గంబూజియా చేప పిల్లలను వదలడం, చెత్త, చెదారాలు తొలగించడం చేయాల్సి ఉంటుంది. నెల్లూరు కార్పొరేషన్ పరిధితోపాటు, జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రజలు ప్రధానంగా డెంగీ, చికున్ గున్యా, మలేరియా జ్వరాల బారిన పడుతున్నారు.... నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ పూర్తి చేసుంటే కొంత దోమల బెడద తప్పేది. 2015లో టిడిపి ప్రభుత్వం, రూ.1130 కోట్లతో మంచినీరు, భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి కొంత చేసింది. వైసిపి వచ్చిన తరవాత దీనిని పాడుచేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు మూలనపడింది. నెల్లూరులో దోమల పుట్టుకకు ఇది ఒక కారణంగా వైద్యులు చెబుతున్నారు.



హరనాథ్‌పురం వద్ద కాలువలో చెత్త ఉన్న దృశ్యం

దోమలపై యుద్ధం ఏదీ..?

వంఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడు శాస్త్రీయంగానే ఆలోచన చేస్తారు. దోమల వల్లే అనేక జబ్బులు వస్తాయని గ్రహించిన ఆయన "దోమలపై యుద్ధం" కార్యక్రమం చేపట్టారు. అప్పట్లో నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చీపురులు పట్టి, వీధులు చిమ్మారు.. చెత్త తొలగించారు. ఫొటోలు, వీడియోలు తీసుకొని తరువాత మమ అనేస్తున్నారు. ప్రభుత్వం చేయడంతోపాటు, ప్రజలను భాగస్వామ్యులు చేయడం, చైతన్యం చేయాల్సి ఉంటుంది. ఆపని చేయడం లేదు. కేవలం మీడియా కోసం చేసే ఇలాంటి కార్యక్రమాల వల్ల ఉపయోగం లేదు. చెప్పుకోడానికి ఘనంగా ఉంటున్నా ఆచరణ మాత్రం అంతంత మాత్రమేనని చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొద్ది రోజులు స్వచ్ఛ భారత్, ఆంధ్ర, నెల్లూరు అంటూ హడావుడి చేస్తున్నారు. చెత్త తొలగించడానికి 2015లో టిడిపి ప్రభుత్వం జిల్లా వ్యాపితంగా సిబ్బంది, వాహనాలు, నిత్యం చెత్త తొలగించడానికి ఏర్పాట్లు చేసింది. కేవలం స్వచ్ఛ పేరుతో కార్యక్రమాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం మంచిది కాదని ప్రజలు కోరుతున్నారు. యుద్ధం కోసం తయారు చేసిన ఆయుధాలు బయటకు తీస్తేనే ప్రయోజనం ఉంటుంది....

ప్రజల ఖర్చు రూ.700కోట్లు..
ప్రభుత్వం రూ.100 కోట్లే .

ప్రభుత్వం దోమల నివారణ కోసం చేస్తున్న ఏడాదికి వంద కోట్ల రూపాయలు మాత్రమే నని తెలుస్తోంది. జిల్లాలోని నెల్లూరు కార్పొరేషన్, ఆత్మకూరు, కావలి, బుచ్చిరెడ్డి పాళెం, కందుకూరు, మున్సిపాలిటీలతోపాటు, అల్లూరు, ఉదయగిరి, కనిగిరి లాంటి ప్రాంతాల్లో సుమారు రెండు వేల మంది పారిశుధ్య కార్మికులున్నారు. వాహనాలు, ఇతర ఖర్చులకు అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామాల్లో కేవలం వంద కోట్లు వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలు దోమల నుంచి రక్షించుకోడానికి ఏడాదికి రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి. జిల్లా వ్యాపితంగా సుమారు 8 లక్షల ఇళ్లు, మరో రెండు లక్షల గదులుంటాయి. ప్రతి రోజూ జెడ్ కాయిన్స్, గుడ్‌నైట్ వంటి మందులు వాడాల్సిందే. ఒక్కో కుటుంబం సుమారు రూ.300 ఖర్చుచేస్తుంది. ఏడాదికి రూ.200 కోట్లు దోమల నివారణ మందులకు ఖర్చు చేస్తున్నారు. జ్వరాలు వస్తే ఏడాదికి కనీసంగా రూ.500 కోట్లు జనం జేబులకు చిల్లు పడుతోంది. ఏ జ్వరం వచ్చినా కుటుంబాలకు కుటుంబాలే ఆసుపత్రుల్లో చేరుకున్నాయి. సుమారు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కలు చూస్తే ఏడాదికి పెద్ద మొత్తంలో జనం ఖర్చుపెడుతున్నారు. కేవలం పారిశుధ్యలోపంతో ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర పేరుతో సిఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన కందుకూరు సభలోనైనా పటిష్టమైన ప్రణాళిక ప్రకటించాల్సి ఉంది. చిన్న దోమే కదా అని వదిలేస్తే.. ప్రజల ధన, ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోంది...

కొనసాగుతున్న గడప గడపకు కార్యక్రమం

ప్రజాశక్తి-నెల్లూరు: రూరల్ నియోజకవర్గ పరిధిలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమం 33వ రోజు చేరుకుంది. శుక్రవారం ఈ కార్యక్రమం మాదరాజు గూడూరు గ్రామంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి విచ్చేసిన నాయకుడికి హారతి ఇచ్చి, నుదుట తిలకం దిద్దిన ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ సోమిరెడ్డి

'కాకాణి'.. కోట్ల ఆస్తులు ఎక్కడో చూపించు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి నాయకులు కాకాణి గోవర్దన్‌రెడ్డి తనకు వందల కోట్ల ఆస్తులున్నాయని చెబుతున్నారని, ఎక్కడున్నాయో చూపించాలని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు రైల్వే కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు హైదరాబాద్, బెంగుళూరులో విల్లాలంట..నెల్లూరులో బిల్డింగ్ అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. తనను తన కుటుంబాన్ని నోటికొచ్చినట్లు తిడుతున్నారని, అల్లుడికి 57 ఎకరాలు ప్రభుత్వ భూమి ధారాదత్తం చేశారని విమర్శించారు.కాకాణి ఒక్కసారైనా నిజం చెబుతారని ఎదురుచూస్తున్నానన్నారు. జగనన్న కాలనీలకు పరిహారం విషయంలో ఒక న్యాయం.. .రామదాసు కండ్రిగ రైతులకు మరో న్యాయమా చేస్తారని అన్నారు. ఎవడబ్బ సొత్తని రాత్రికి రాత్రి రైతుల భూములను అల్లుడికి ధారాదత్తం చేస్తారని ప్రశ్నించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి వల్ల ఈ రోజు నెల్లూరు కోర్టులో ముద్దాయిగా నిలబడ్డానన్నారు. కృష్ణపట్నం ఆనందయ్య ఆయుర్వేదం మందు విషయంలో తనపై బనాయించిన అక్రమ కేసు విషయంలో కోర్టుకు హాజరయ్యానని తెలిపారు. ఇటీవల తాను హైదరాబాద్ వెళ్లినప్పుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాలో కొన్ని అంశాలు మాట్లాడారని, అందులో నెల్లూరులో ఆఫీసు కొనేశానని, బెంగుళూరులో విల్లా కొన్నానని, హైదరాబాద్‌లో నా కుమార్తెకు విల్లా కొనిచ్చానని చెప్పుకొచ్చారన్నారు. గతంలో సింగపూర్, మలేషియా, హాంకాంగ్ లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయని విమర్శ చేశారని, అవి ఎక్కడున్నాయో ఇప్పటి వరకు చూపించలేదన్నారు. మరో రూ.400 కోట్లకు కూడా లెక్కలు చెప్తారని, ..అవి ఎక్కడున్నాయో చూపించలేదన్నారు. తన అల్లుడు తాను ఆస్తులు కొనిస్తే తీసుకునే రేంజ్ లో లేరని ..60 ఏళ్ల క్రితమే వారిది కాంట్రాక్టర్ల కుటుంబం అన్నారు. వారి తాతలు ముత్తాతలు కాంట్రాక్టర్లు అన్నారు. నాకు, నాకుటుంబాన్ని అల్లుడు ఆర్థికంగా సహాయపడుతారని, అలాంటి వారికి తాను విల్లా కొనిచ్చానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తన స్నేహితుడు వర్మ కుమారుడికి చెందిన భవనంలో వేదాయపాళెం ఆఫీసు నిర్వహిస్తున్నానని, తన కుమారుడు బెంగుళూరులో అద్దె ఇంట్లో ఉన్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే విషయం తెలుసుకుని ఒక్క రోజు ముందు బినామీ కంపెనీకి 57 ఎకరాలు అప్పగించిన విషయం వాస్తవం కాదా ప్రశ్నించారు. అక్కడ మార్కెట్ విలువ ఎకరా రూ.కోటి నుంచి రూ.1.25 కోట్లు ఉన్న మాట వాస్తవం కాదా..అన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కందుకూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లు పరిశీలించుటకు కందుకూరు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డికి ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణానికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఓ ఆనంద్, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సబ్ కలెక్టర్ ఆఫీస్ లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సిఎం పర్యటనలో ఏటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి పర్యటన



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విజయవంతం చేయాలని సూచించారు. ముందుగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని చూడాలని పోలీస్ శాఖ వారికి సూచించారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ప్రాంతంలో దిగి, తిరిగి కార్యక్రమం పూర్తయి వెళ్లే వరకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మంత్రివర్యులు తెలియజేశారు.కందుకూరు పట్టణంలోని శ్రీ శ్రీ అంకమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి , స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు , ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ , మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాంతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం అధికారులు మంత్రికి ఆలయ నమూనాను ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ సూర్య తేజ, డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ కే అనూష, ఇతర శాఖల ఉన్నతాధికారులు, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడాలి

ప్రజాశక్తి-కందుకూరు

స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం కందుకూరు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కందుకూరు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధికి దోహదపడాలని ఆ దిశగా అడుగులు వేసి చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. కందుకూరు నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం, పారిశ్రామికవంతంగా అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితి నేటికి ఉంది . ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఈ ప్రాంతం నుండి ఎంతమంది ప్రజా ప్రతినిధులు ఎన్నికైనా కందుకూరు నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చేయడంలో వెనకబడినదని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కందుకూరు ప్రాంతాన్ని నెల్లూరు జిల్లాలో చేర్చి, ప్రజలను ఇక్కట్లు పాలు చేసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు,



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కందుకూరు నియోజకవర్గాన్ని వెంటనే ప్రకాశం జిల్లాలో కలుపుతానన్న హామీ ని అమలు చేయాలని సిపిఎం తన వినతి పత్రంలో పేర్కొంది. సోమశిల ప్రాజెక్టు నుండి రాళ్లపాడు కు వచ్చే నీటి కాల్వను వెడల్పు చేసి 1.5 టిఎంసి ల నీటిని విడుదల చేయాలని, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువను పొడిగించి ఆ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని, రాళ్లపాడు అభివృద్ధికి బడ్జెట్ లో పది కోట్ల రూపాయలు కేటాయించాలని, గుడ్లూరు మండలం చిన్న లాటరిపి గ్రామంలో హార్టికల్చర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, కందుకూరు కు ఉత్తర వైపు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ట్రాఫిక్ ని నియంత్రించాలని, కందుకూరు ఏరియా ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో కూడిన జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, రామాయపట్నం పోర్టు లో స్థానిక యువతి, యువకులకు ఉద్యోగ కల్పన కోసం, నైపుణ్యం పెంచడం కోసం కందుకూర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని ఏర్పాటు చేయాలని, పరిశ్రమల కోసం అవసరమైన భూములను మాత్రమే సేకరించాలని, కార్పొరేట్ ల ప్రయోజనాల కోసం ఎక్కువ భూములు సేకరించి, ఇక్కడున్న ప్రజలను కూలీలుగా మార్చవద్దని, 2013 చట్టం ఆధారంగా భూసేకరణ ను జరపాలని వారి వినతి పత్రంలో పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఎస్. ఏ గౌస్, సిపిఎం గుడ్లూరు, ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శులు జి వెంకటేశ్వర్లు, జివిబి కుమార్, సిపిఎం నాయకులు ఎస్.కె మున్వర్ సుల్తానా, ఎస్ పవన్ కుమార్, డిఎం రాయుడు, పొందూరి కొండమ్మ, పద్మావతి ప్రభుత్వాన్ని కోరారు.

ఆదర్శప్రాయుడు 'దామోదరం'

ప్రజాశక్తి-నెల్లూరు: పదవులు వస్తే.. తరతరాలకు ఆస్తులను కూడబెట్టుకునే రోజుల్లో.. నిరాడంబర జీవితాన్ని గడిపి.. అందరికీ ఆదర్శప్రాయులైన మహనీయులు కీర్తిశేషులు ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా నుడా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడారు.. రాష్ట్ర తొలి దళిత సిఎం దామోదరం సంజీవయ్య జీవితమంతా నిరాడంబరంగా సాగిందన్నారు. నిజాయతీకి నిలువెత్తు రూపమని.. పెన్షన్లకు ఆధ్యుడని వెల్లడించారు. చివరి వరకు సాధారణ జీవితాన్ని గడిపి.. ఎందరికో ఆయన జీవితం ఆదర్శమైందన్నారు. కార్యక్రమంలో నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, సిటీ ప్లానర్ హిమబిందు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం పై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

విబిఆర్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సౌఖ్య అనే విద్యార్థిని పాఠశాల పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమని ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో (ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ) ధనలక్ష్మీపురం లో గల విబిఆర్ పాఠశాల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల మధ్య మార్కులతేడాతో వారిని



నినాదాలు చేస్తున్న విద్యార్థి నాయకులు

వేరు చేసి మాట్లాడటం వలనే తను ఈ అఘాయిత్యానికి పాల్పడిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు కేవలం మార్కులే కొలమానం కాదని, స్వేచ్ఛాపూరితమైనటువంటి వాతావరణంలో విద్యార్థులకు చదువు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం వారు వసతి గృహాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు అవసరం లేదని ఇష్టానుసారంగా వసతి గృహాలను ఏర్పాటు చేసి లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేసుకుంటూ బలవంతపు చదువులను విద్యార్థులపై రుద్దుతూ విద్యార్థి మరణాలకు కారణం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.. అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కిషోర్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-లింగసముద్రం

మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీ పరిధిలోని జంగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మద్దిశెట్టి రజిని,గ్రామానికి చెందిన మరికొందరు ఎయిడ్స్,అనాథ బాల బాలికలకు 15 వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేసి తన సేవాభావ గుణాన్ని చాటుకున్నారు. జంగారెడ్డిపాలెంలో వ్యసాయ కుటుంబంలో పుట్టి కష్టం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రజినికి అనాథలకు సాయం చేయాలనే ఆలోచన రావడంతో తన గ్రామానికి చెందిన కొట్టె రవి,కదిరి వెంకటేష్,పిడుగు నాగరాజు,జొన్న సుజాతల సహకారంతో 15 వేల రూపాయల విలువ గల బియ్యం,నిత్యావసర వస్తువులు సేకరించి బోగోలు మండలం భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథలకు సహాయం అందజేశారు.

'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



పట్టణంలోని సత్రం సెంటర్ వద్దకు శనివారం ఉదయం 9 గంటలకు మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ, రూరల్ మండలంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నాలన్నారు.

నోటీసులకు సమాధానం లేదు..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మ దర్గాకు సంబంధించిన నాలుగు రూములకు ఇంతవరకు కూడా జవాబు ఇవ్వలేదని దర్గా ఇఒ పత్రిక ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొంతమంది వ్యక్తుల అనుభవంలో ఉన్న నాలుగు రూములను, వక్ఫ్ బోర్డు అధీనంలోకి ఇవ్వాలని, సిఇఒ ఇదివరకే రెండు అర్జీలు ఇచ్చారని, 11వ తేదీన మూడో అర్జీని ఇచ్చారని, కానీ ఇంతవరకు వారు ఆ రూములను ఖాళీ చేయలేదని దర్గాకు సంబంధించి ఇఒ మహమ్మద్ హుస్సేన్ పత్రికా ముఖంగా తెలియజేశారు. తదుపరి చర్యలు సిఇఒ తొందరలో తీసుకుంటారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.



చుండూరు శ్రీహరి నియామకం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌గా చుండూరి శ్రీహరి నారాయణరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కాగా జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వులను జిల్లా రెవెన్యూ ఆఫీసర్ అందించారు. వారికి స్వర్ణ దీక్షిత్ అడ్వకేట్, అలానే శ్రీహరి నారాయణరావు ఆఫీస్ జూనియర్స్ వారికి హార్ధిక శుభాకాంక్షలు తెలియశారు.

అధికారుల నిర్లక్ష్యంతో నీటికష్టాలు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం యాదవపాలెం, రాజా వీధిలోని ప్రజలు అధికారుల నిర్లక్ష్యంతో నీళ్ల కష్టాలు ఎదుర్కొంటున్నారని బోగోలు పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ దొడ్ల అంజయ్య యాదవ్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా దొడ్ల అంజయ్య యాదవ్ మాట్లాడుతూ బోగోలు పంచాయతీలోని యాదవ పాలెం లో జల జీవన్ మిషన్ పన్నుల్లో భాగంగా ఐదు రోజుల క్రితం బోగోలు పంచాయితీ కార్యాలయం, రాజావీధి నుండి యాదవపాలెం వరకు పైప్‌లైన్ వేయడం కోసం రోడ్డు పక్కన జెసిపి సాయంతో గుంతలు తీయడంతో బోగోలు పంచాయతీ నుంచి యాదవ పాళేనికి వచ్చే ప్రధాన పైప్‌లైన్ దెబ్బ తినడంతో ఐదు రోజుల నుండి యాదవ పాలెం, రాజా వీధిలోని ప్రజలకు మంచినీళ్లు లేక నానా కష్టాలు పడుతున్నారన్నారు అని తెలిపారు. ఒక్కపూట నీళ్లు రాకపోతే ప్రజలు ఎంత ఇబ్బందులకు గురవుతారని అటువంటిది ఐదు రోజుల నుంచి నీళ్లు అందకపోవడంతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని, ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే పైప్‌లైన్‌ను పనులు పూర్తిచేసి ప్రజలకు నీరందించాలని తెలిపారు.

నీటిఎద్దడిపై ప్రజాప్రతినిధులు గళమెత్తాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మెట్టప్రాంతంలో నెలకొన్న నీటి ఎద్దడిపై కందుకూరు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ప్రకాశం, నెల్లూరు జిల్లాల మంత్రులు, ఎంఎల్‌ఎలు తమ గళం వినిపించాలని సీతారామసాగర్ సాధన సమితి నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. మెట్టప్రాంతాల ప్రధాన సమస్య అయిన తాగు, సాగునీరు ఏర్పాటు వలసల నివారణకు వెలుగొండ ప్రాజెక్ట్ అందులో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ సీతారామసాగర్ నిర్మాణను పూర్తి చేయడానికి నిధులను కేటాయించి త్వరగా పూర్తి చేయాలని కోరాలన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల పరిధిలోని బిజ్జంపల్లి గ్రామంలో రైతులు, ప్రజలతో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో శంకు



ఆందోళన చేపడుతున్న బిజ్జంపల్లి గ్రామస్తులు

స్థాపనకు ప్రారంభానికి పరిమితమై సీతారామ సాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ నేటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి మండల ప్రజలకు సాగు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతూ వలసల ప్రధానంగా ఊరులే ఖాళీ అయి దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు శంకుస్థాపన చేసి 35యేళ్లు గడుస్తున్నాయని నేటికీ ఆయన విడుదల చేసిన నిధులతో పనులు జరిగాయి తప్ప ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. పూర్తిస్థాయిలో వెలిగొండ రిజర్వాయర్‌లో అంతర్భాగమైన సీతారాం సాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లు పూర్తి కావాలంటే 7 వేల కోట్ల రూపాయలు అవసరం అన్ని జరగబోయే బడ్జెట్లో విడుదల చేయాల్సి ఉందని వెంటనే రెండు జిల్లాల ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి భావితరాల భవిష్యత్తు దీర్ఘకాలిక ప్రధాన సమస్యగా మారిన సాగునీరు ఇబ్బందులను తీర్చేందుకు ముఖ్యమంత్రి నిలదీయాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులు స్పందించి వెనుకబడిన మెట్ట ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు వేలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సీతారాం సాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ త్వరతి గతిన పూర్తి చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఉపసర్పంచ్ నారాయణమ్మ

మౌలిక వసతులు కోసం తీర్మానాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని గణేశ్వరపురం గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించామని ఉపసర్పంచ్ కనపర్తి నారాయణమ్మ అన్నారు. మండలంలోని గణేశ్వరపురం పంచాయతీలో గత కొద్ది రోజుల క్రితం సర్పంచి అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని అందుచేత ఉపసర్పంచ్ కనపర్తి నారాయణమ్మ అధ్యక్షతన వార్డు మెంబర్ల తో సమావేశం నిర్వహించి గ్రామంలో మౌలిక వసతుల కోసం పలు తీర్మానాలను చేప ట్టారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, యువ నాయకులు పేరం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-మర్రిపాడు

జనవరిలో సావిత్రిబాయి పూలే, షేక్.ఫాతిమా జయంతి సందర్భంగా మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులను, ప్రశంసా పత్రాలను, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఒత్తిళ్లకు లోను కాకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు భయాందోళనకు గురైతే గందరగోళంతో కూడిన జవాబులు రాసే అవకాశం ఉన్నందున భయానికి చెక్ పెట్టాలంటే ముందు తల్లిదండ్రులు విద్యార్థులకు కావాల్సిన ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. వారిపై ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదని, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ఆవాజ్ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్‌డి రహమతుల్లా, మండల కార్యదర్శి ఎస్‌డి గౌస్ బాషా, ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని అర్హులైన సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిస్కం ఎడి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొంటూ సౌర విద్యుత్ పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. సహజ సంపదలు నిండుకుంటున్న సమయంలో పొల్యూషన్ రహిత సోలార్ సిస్టంను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై తహశీల్దారుకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలం గుమ్మళ్ల దిబ్బ కొత్త కాలనీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పాశం మల్లికార్జున అనే వ్యక్తి ప్రభుత్వానికి సంబంధించిన 100 అంకాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, దానిపై అధికారులు దృష్టి పెట్టాలంటూ ఆ ప్రాంత మహిళలు శుక్రవారం కోవూరు తహశీల్దార్ నిర్మలానంద బాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవంగా ఆ ప్రాంతం ఆక్రమణదారుడిది కాదని, అతనికి ఆధార్, రేషన్‌కార్డు నెల్లూరులో ఉన్నాయని, టిడిపి అధికారంలోకి వచ్చిందని, ఇక్కడికి వచ్చి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. అడిగితే ప్రభుత్వం తమదని, తమను ఎవరు ఏం చేయలేరని ధీమా వ్యక్తం చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఈ ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాంత చిన్నారులకు అవసరమైన అంగన్ వాడీ కేంద్రం నిర్మించాలని ఈ ప్రాంత మహిళలు విన్నవించారు. అందుకు ఆయన స్పందించి వెంటనే ఆ ప్రాంతానికి సర్వేయర్, ఆర్ఐ, విఆర్‌ఒను పంపించి పూర్తిస్థాయిలో నివేదికను తెప్పించుకుంటా మన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని సొంత భూమి ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతువిశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.రవి కుమార్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 25వ తేదీ లోపు మండలంలోని రైతులందరూ దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని, పిఎం సామాన్ నిధి యోజన (పిఎం కిసాన్) పొందుతున్న రైతులందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం పథకాన్ని



సద్వినియోగం చేసుకోవడానికి భూమి పాసుబుక్, 1బి, ఆధార్ నెంబర్, ఆధార్ నెంబర్‌కు ఫోన్ నెంబర్ లింక్ తప్పనిసరిగా అయి ఉండాలన్నారు. ఈ విధంగా రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని అట్లా లేనియెడల రైతుకి కేంద్రం, రాష్ట్ర పథకాలు ఇతర ప్రయోజనాలు లభించమని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శారద, రైతులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనపై శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి



పేదరిక నిర్మూలన పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు అంశాలపై చార్టు రూపంలో ఎపిఎం మహమ్మద్ ఖాజారహంతుల్లా సిసిలు, విఒఎలు, ఒబి సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవన్లో ఏర్పాటుచేసిన ఎంసిఎల్‌ఎఫ్ఎస్ విజన్ బిల్డింగ్, సిఎల్‌ఎఫ్ స్థాయి ప్రదర్శన రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో సిసిలు, విఒఎలు, ఒబి సభ్యులకు శిక్షణను పూర్తి స్థాయిలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పేదరిక నుంచి ఆర్థిక పురోగతి సాధించేందుకు పలు సూచనలను చార్ట్ రూపంలో ప్రదర్శనతో అందజేశారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని రావులకొల్లు గ్రామంలో 15వ తేదీ మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పూర్తి చేయనున్న సోక్ పిట్స్ (ఇంకుడు గుంతలు) నిర్మాణాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి, విస్తరణాధికారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ రావులకొల్లు గ్రామంలో 11 సోక్‌పిట్స్‌ను చేపట్టనున్నారని, ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తం 397 సోక్ పిట్‌లను స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెర్లోయడవల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది హాజరు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ



పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

ఆదేశాల మేరకు పూర్తి చేయాల్సి ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నాగులపాడు ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని సందర్శించి కేంద్ర నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో నాగులపాడు సర్పంచ్, ఉపాధి హామీ పథకం ఇసి, టిఎ, పంచాయతీ కార్యదర్శి జునైద్, ఎంఆర్‌సి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నేడు విడవలూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విడవలూరు

విడవలూరు పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో హీరో మోటార్స్, డైకిన్ వంటి సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ ధ్రుపత్రాలతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలియజేశారు.

దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉదయగిరి

మండలంలోని కులవృత్తులు చేసుకుంటున్న కుమ్మరి శాలివాహన, మేదర కులాలకు ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలు బిసి కార్పొరేషన్ ద్వారా అందిస్తుందని ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అప్పాజీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిసిలలోని కుమ్మరి శాలివాహన, కుటుంబాల వారు కుండలు తయారీ, మేదర వెదురు బుట్టలు తయారీ వారు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. కుమ్మరి శాలివాహనులకు, మేదరలకు గ్రూపులుగా ఏర్పడి ఒక్కొక్క గ్రూపునకు యూనిట్ విలువ రూ.3లక్షలు మంజూరు చేయబడతాయని 50శాతం ప్రభుత్వ సబ్సిడీకి గానూ, 50 శాతం బ్యాంకు రుణం గానూ అందిస్తారని తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన వారు కుల ఆదాయ, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో ఓబి ఎంఎంఎస్ ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కార్పొరేట్‌లకు మాత్రమే ఉపయోగపడే బడ్జెట్

ప్రజాశక్తి-కావలి

కేంద్రంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు, కార్మికులకు, శ్రామికులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని, కేవలం కార్పొరేట్‌లకు మాత్రమే ఉపయోగమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన శుక్రవారం కావలి సిపిఎం ఆఫీసులో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో "రౌండ్ టేబుల్ సమావేశం" నిర్వహించారు. ఈ సమావేశానికి మాదాల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడా పారిశ్రామిక వ్యక్తులకు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం కోసం ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించలేదన్నారు. రైతులు పండించిన పంటకు సమగ్ర చట్టం చేయలేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేసేందుకు పరుగులు తీస్తుందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, విశాఖఉక్కు ప్రయివేటీకరణ చేసేది లేదని ఎక్కడ హామీ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్ అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడీదారులకు రాయితీలు చేకూర్చే విధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ శ్రామికవర్గానికి పొట్టకొట్టే విధంగా ఉందన్నారు. ఇప్పటికే అధిక ధరలు, కరెంటు, రకరకాల యూజర్ ఛార్జీలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచే విధంగా బడ్జెట్ ఉండాలన్నారు. పెట్టుబడీదారులకు లాభాలు చేకూర్చే విధంగా ఉండటం చాలా దుర్మార్గమన్నారు. బడ్జెట్లో సవరణలు చేయాలని ప్రజలకు, శ్రామికులకు, రైతులకు ఉపయోగపడేలా ఉండాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు సరైన ధర కల్పించలేదన్నారు. ఈ బడ్జెట్ రైతులకు తోడ్పడే విధంగా లేదన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన ధరల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులే దేశానికి వెన్నుముక అని, పాలకులు చెబుతూ రైతుల నడ్డి విరిచేవిధంగా సంస్కరణలు చేస్తున్నారన్నారు. ప్రజలకు కూడా ఉపయోగపడే బడ్జెట్ కాదని, అధిక ధరలు తగ్గించడంలో పాలకులు విఫలం అవుతున్నారన్నారు. ప్రజలకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నిరంగాల ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ఏమీ కాదన్నారు. దానిపై వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు రకరకాల పద్ధతులలో నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నాయని, ఎన్నో బడ్జెట్లు ప్రవేశ పెట్టెరని, ఇప్పటికీ పేదలు నివసించే ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయన్నారు. సక్రమంగా రోడ్లులేవని, తాగేందుకు పుష్కలంగా నీళ్లు లేవన్నారు. కడుపునిండా తిండి తినేందుకు డబ్బులు లేక ఇంకా ఇబ్బందులు పడే పేదలు ఉన్నారని ఈ ప్రభుత్వాలు మాటల గారడీతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ప్రజలు కూడా సమైక్యంగా పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిడిఎఫ్ మాజీ నాయకులు కరవది భాస్కర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎల్.శ్యామలమ్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్ రావు, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, సిపిఐ నాయకులు కె.నాగరాజు, దర్గాబాబు, రావి కోటిరెడ్డి, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు

ప్రభుత్వ ఉద్యోగులూ బాధితులే..

ప్రజాశక్తి-కావలి

కావలిలో ఇటీవల బయటపడ్డ రూ.78 కోట్ల కుంభకోణంలో దాదాపు 80 మంది పోలీసులతో పలుశాఖల ఉద్యోగులు తమ డబ్బును కట్టి, మోసపోయారు. అదేవిధంగా విద్యుత్ శాఖ సిబ్బంది కూడా మహబూబ్ సుభాని షేర్ ట్రేడింగ్‌లో దాదాపు 2 కోట్ల 20 లక్షల రూపాయలు కట్టినట్లు ఆలస్యంగా తెలియవచ్చింది. వీరిలో ఈజీమనీ సంపాదించాలన్న వ్యసనంతో మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక్కడి సిబ్బందిలో ఒక ఎల్.ఐ. రూ.37 లక్షలు, ఒక ఎ.ఎల్.ఎం. రూ.17 లక్షలు, ఒక లైన్‌మెన్ రూ.10 లక్షలు, ఒక షిఫ్ట్ ఆపరేటర్ తన డబ్బు రూ.25 లక్షలు, తన ద్వారా ప్రజలసొమ్ము ఒక కోటి50 లక్షల రూపాయలు షేర్ ట్రేడింగ్ వ్యాపారికి చెల్లించి, ఆల్లో లక్ష్మణా అని అల్లాడుతున్నట్లు తెలియవచ్చింది. ఈ మేరకు బాధితులైన విద్యుత్ సిబ్బంది శుక్రవారం కావలి రూరల్ పోలీస్ స్టేషన్లో వేర్వేరుగా, వ్యక్తిగతంగా పిర్యాదులు చేశారు. ఈ షేర్‌ట్రేడింగ్ బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వీళ్ళల్లో రోజు కూలి చేసుకునే పేదలు చాలామంది బయటకు వస్తున్నారు. పోలీస్ అధికారులు మోసగాడి నుండి తమ డబ్బును ఇప్పించాలని, లేకపోతే తమకు అప్పులబాధతో ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు.



వికలాంగుడికి చేయూత

ప్రజాశక్తి-కావలి

హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గత 8 సంవత్సరాలుగా మంచానికే పరిమితమైనా గోచిపాతల.శ్రీనివాసులు అనే వికలాంగుడికి ఎయిర్ బెడ్, ఎయిర్ మిషన్‌ను హ్యాపీ సేవాసంస్థ సభ్యులు అందజేశారు. శుక్రవారం కావలి పట్టణ 18 వ వార్డ్ లో నివాసముంటున్న గోచిపాతల. శ్రీనివాసులు గత 8యేళ్లుగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్ళు కోల్పోయి మంచానికే పరిమితమై పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ గత వారం తనని సంప్రదించిన హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనిబాషా దృష్టికి బెడ్ అవసరం అని తెలియజేసిన వెంటనే సంస్థ సభ్యులతో విషయం తెలియజేసిన వెంటనే స్పందించిన సంస్థ సలహాదారులు చేవూరు. ప్రభయ్య దాతృత్వంతో ఈ ఎయిర్ బెడ్‌తో పాటు ఎయిర్‌మిషన్ ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని హ్యాపీ సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా అన్నారు. హ్యాపీ సేవా సంస్థ ద్వారా ఘనిబాషా సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనిబాషా, గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, సలహాదారులు చేవూరు. ప్రభయ్య, హ్యాపీ సేవా సంస్థ ఉపాధ్యక్షులు దేవరకొండ. విజయ్, రత్నమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం.వి.ఎన్. ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

కాంద్ర యవనేస్తం వ్యవస్థాపకులు కాంద్ర సతీష్ నాయుడు ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో రూ.20వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, ప్రతినెలా 1వ తేదీన తాము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు, భవాని తదితరులు పాల్గొన్నారు.


నిరసన ధర్నా చేపడుతున్న నాయకులు

మద్దతు ధర కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-విడవలూరు : రైతులకు మద్దతు ధర కల్పించి వారిని రక్షించాలని ఎపి కౌలురైతుల సంఘం నాయకులు శుక్రవారం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మద్దతు ధర సాధన కోసం 22వ తేదీ నెల్లూరు ఎబిఎన్ కాంపౌండ్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగే ర్యాలీని జయప్రదం చేసి రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తలారి సురేష్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, పోలిరెడ్డి అశోక్ రెడ్డి, మార్కాపురం లక్ష్మీనారాయణ, బడుగు సుబ్బయ్య, ఎస్కే ఖాదర్ మస్తాన్, మండపేట అంకయ్య, కుడుమల మోహన్, డేగ అమరశేఖర్, మోడిగుంట రామచంద్రయ్య, తదితరులున్నారు.



మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డికి ధన్యవాదాలు

ప్రజాశక్తి-విడవలూరు

కోవూరు నియోజకవర్గ వైసిపి బూత్ కమిటీల కన్వీనర్‌గా నియమితులైన కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం మండలంలోని మాజీఎంఎల్‌ఎ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహుకరించి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, సిరివెళ్ల కోటయ్య, కాయల రఘు, తలారి శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు వెంటనే జీతాలివ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముస్లిం సోదరులను మసీదులలో నవాజ్ చదివించే ఇమామ్, మోజన్‌లకు వెంటనే జీతాలు ఇవ్వాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్దాని పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని తూర్పువీధి నూతన మసీదు వద్ద ఇమామ్, ముస్లిం సోదరులతో కలిసి నిరసన తెలియజేశారు. గత పది నెలలగా వారికి రావాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి యస్దాని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వీరికి అదనంగా రూ.5వేలు పెంచి జీతాలు ఇస్తామని చెప్పిన విధంగా రూ.5వేలతో కలిపి జీతాలను అలాగే మసీదు నిర్వహణకు రూ.5వేలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. పది నెలలుగా జీతాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మసీదులో ఉండే ఇమామ్‌లు సైతం పస్తులు ఉండలేక వేరే పనులకు వెళ్తున్నారని అల్లా సేవకులను బాధ పెట్టడం మంచిది కాదని దయచేసి వెంటనే వారికి రావాల్సిన జీతాలను విడుదల చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మసీద్ ఇమామ్, షేక్ అదిల్ హజరత్, మస్తాన్, షేక్.అల్లా భక్షు, ఎస్డ్.వసీం, అక్రమ్, నాయక్ రసూల్, షేక్ రియాజ్, ఎంజీ అబ్దుల్లా, ఎస్డి రహమత్, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ముస్లిం సోదరులు

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్లో అసంఘటిత రంగ కార్మికులు ఉచిత నమోదు కార్యక్రమాన్ని చేసుకుంటే ఎంతగానో ఉపయోగకరమని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ గౌస్‌అహ్మద్ తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎంపిడిఒ శ్రీహరిరెడ్డితో ఈ-శ్రమ్ పోర్టల్‌కు సంబంధించి పలు విషయాలను చర్చించారు. అందులో నమోదు చేసుకున్న కార్మికులకు 12 అంకెలు ఉన్న గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ పథకంలో చేరేందుకు 16 నుంచి 59 సంవత్సరాల లోపు మాత్రమే అర్హులన్నారు. ఇవి నమోదు చేసేందుకు ఈకెవైసి కలిగిన ఆధార్, ఆధార్తో మొబైల్‌నెంబర్ అనుసంధానం ఉంటే సరిపోతుందన్నారు. ఈ నమోదు కార్యక్రమాన్ని సచివాలయాల్లో గానీ, పోస్టాఫీస్లో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకున్న వెంటనే యూనివర్శల్ ఐడీ నెంబర్ ఉన్న కార్డు వస్తుందన్నారు. ఈ నమోదు కార్యక్రమానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అందులో నమోదు చేసుకున్న సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం కింద ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం కలిగినా రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వస్తుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని అసంఘటిత రంగాల్లో పనిచేసున్న కార్మికులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

ఎంఎల్‌ఎ నివాళులు

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని కాట్రాయిపాడు టిడిపి సీనియర్ నాయకుడు తాళ్లూరి సుధాకర్ నాయుడు తండ్రి తాళ్లూరి వెంకట కృష్ణయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందారన్నా విషయం తెలవడంతో ఎంఎల్‌ఎ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం వారి నివాసానికి చేరుకొని ఆయన మృతదేహాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పమిడి రవికుమార్, తాళ్లూరి మోహన్ నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిష్కార మార్గాలను తెలపాలి

ప్రజాశక్తి-కలిగిరి

నియోజకవర్గంలోని కలిగిరి ఎంఇఒ ఆఫీస్ ప్రాంగణంలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో చేపట్టిన మార్పుల గురించి జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పాల్గొని, ప్రజల దగ్గర నుండి అర్జీల ద్వారా వచ్చిన సమస్యల గురించి పరిష్కార మార్గాన్ని తెలపాలని అధికారులను తెలిపారు. ఎంఎల్ఎ శ్రీ కాకర్ల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం కోసం స్థానిక నాయకులు కూడా విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను విద్యను అభ్యసించే విధంగా కృషి చేయాలని, విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను అన్వేషించాలని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తమ గ్రామం నుండి పాఠశాల మధ్య దూరం ఒక కిలోమీటర్ దాటితే ఒక్కొక్క విద్యార్థికి రవాణా ఖర్చుల


ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

రూపంలో నెలకు రూ.600 అందించే విధంగా మార్గదర్శకాలను ఏర్పాటు చేశారని, ఇంకా అవసరమైన సదుపాయాలు సమకూరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో కలిగిరి మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

సిడిపిఒగా సునీత బాధ్యతలు

ప్రజాశక్తి-ఉదయగిరి



ఐసిడిఎస్ ప్రాజెక్టు నూతన సిడిపిఒగా ఎన్.సునీత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సిడిపిఒ శారద యథావిధిగా కావలి అసిస్టెంట్ సిడిపిఒగా బదిలీ అయ్యారన్నారు. దాంతో జిల్లా ఐసిడిఎస్ కార్యాలయంలో ఎక్స్టెండేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఉదయగిరి ప్రాజెక్టు సిడిపిఒగా బాధ్యతలు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల దూర ప్రభుత్వ అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని బాలింతలకు గర్భిణులకు చిన్నారులకు తప్పని సరిగా సిబ్బంది అందిస్తూ సమయపాలన పాటించాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే అట్టి వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



లోన్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సంగం

బిసి కార్పొరేషన్ లోన్లు దరఖాస్తుకు శనివారం 15వ తేదీ ఆఖరు అని, ప్రతిఒక్కరూ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని బిసి కార్పొరేషన్ ఇడి నిర్మలాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్పొరేషన్ లోన్లపై ఎంపిడిఒ షాలెట్‌తో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ లోన్లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. జనరిక్ మెడిసిన్ లోన్లకు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 15 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. రూ.8 లక్షల యూనిట్, నాలుగు లక్షల సబ్సిడీతో మండలానికి ఒక జనరిక్ మెడిసిన్ యూనిట్ మంజూరైందన్నారు. అర్హులైన ఒసి రెడ్డి సామాజిక వర్గం వారు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా కుమ్మరి, మేదర కులస్తులు రూ.3లక్షల యూనిట్‌తో ముగ్గురు సభ్యులతో గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సూచనలిస్తున్న సిఐ గంగాధర్

ఆటోడ్రైవర్లకు సూచనలు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ పలు సూచనలు అందజేశారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సిఐ గంగాధర్ మాట్లాడుతూ ఆటోలో ఎక్కే ప్రయాణికులపై గౌరవంగా మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ఇటీవల కొందరు ఆటో డ్రైవర్లు ఇతర ప్రాంతాల్లో మహిళలపై అమర్యాద ప్రవర్తలపై వీరికి హెచ్చరికలు చేశారు. ఆటోలలో ప్రయాణించే సమయంలో ప్రయాణికులపై మహిళలపై ప్రవర్తన సరిగా లేకపోతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పట్టణంలో సూచించిన ప్రదేశాలలో మాత్రమే ఆటోలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఆటోలను ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అధిక లోడుతో డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

18న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ అనుసముద్రంపేట ఎంపిడిఒ కార్యాలయంలో 18వ తేదీన మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బోయిల్ల పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలియజేశారు.

డి.బి.ఎస్.లో స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి-కావలి

స్థానిక డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం "కాలేజీ ఫౌండేషన్ డే" సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ కండక్ట్ చేశారు. ఈ స్పోర్ట్స్ మీట్స్‌లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల ఫౌండేషన్‌డే సందర్భంగా కళాశాలలో బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు, ఒత్తిడి తగ్గించడంలో సహాయపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వశిష్ఠ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ



క్రీడలు శారీరక సామర్థ్యం, నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా క్రీడల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.రమేష్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్. దాసరి శివసాగర్ కుమార్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ పాలేటి మహేంద్ర బాబు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో పోషణ్ భీ పడాయి భీ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కోటేశ్వరి సుభాషిణి మాట్లాడుతూ పౌష్టిక ఆహార లోపం వల్ల పిల్లలు తల్లులు రక్తహీనతకు గురవుతారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని తల్లులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యానికి పుడతారని తెలిపారు. సూపర్వైజర్స్ సుప్రజ, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మండలంలోని ఎపి మోడల్‌స్కూల్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, పోషణ్ భీ - పడాయి భీ కార్యక్రమంపై శుక్రవారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ఐసిడిఎస్ సిడిపిఒ సునీలత ఆధ్వర్యంలో జి.కస్తూరి, విజయలక్ష్మి శిక్షణ ఇచ్చారు. 0-6 సంవత్సరాల బడి దగ్గర ఉండే పిల్లలు, ఇంటి వద్ద ఉండే పిల్లలకు, పోషణ ఈసీసీ ప్రీస్కూల్ యాక్టివిటీస్‌పై శిక్షణ అందజేశారు. కార్యక్రమం మూడు రోజులు జరుగుతుందని రేపటితో ముగిస్తుందని తెలియజేశారు. ప్రీస్కూల్ పిల్లలకు మంచి పౌష్టికాహారం అందిస్తూ, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని తెలిపారు. పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సామూహిక కార్యక్రమం, బాల్య విద్య ప్రాముఖ్యత, ఫౌండేషన్ విద్య, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా విధానం నేర్పేవిధానం తదితరాలపై శిక్షణ ఇచ్చామన్నారు. మండలంలోని 52మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొన్నారు.



గిరిజనులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు వృత్తి రీత్యా విదేశాల్లో ఉన్న ఒట్టూరు సుధాకర్ - చిత్రకల్పన దంపతుల కుమారుడు ఒట్టూరు.సుచిర్ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. అనంతరం సంయుక్త సేవా సంస్థకు ఒట్టూరు సుచిర్. పేరుపై రూ.30వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నెల్లూరు పంచాయతీరాజ్ శాఖ డిఇ ఒట్టూరు.రమేష్, రిటైర్డ్ సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఆత్మకూరు.కల్యాణ్, దాత ఒట్టూరు.చిత్ర కల్పన, వారి కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, జయచంద్ర, రవీంద్ర, లక్ష్మీ రాజ్యం , రూప్సీ, రాధిక,ఒ.సుచిత్, గణేష్,వెంకట సాయి చరణ్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ



ప్రజాశక్తి-కలిగిరి : కలిగిరి తహశీల్దార్ కార్యాలయంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది విధులు, గురించి అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే అర్జీదారులకు ఒకటి రెండు రోజుల లోపల ధ్రువీకరణ పత్రాలు అందే విధంగా చూడాలని తెలిపారు. అర్జీదారులతో గౌరవంగా మెలగాలని ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని తెలియజేశారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వాటి పరిష్కారం మార్గాలు చూపాలని తెలిపారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పరిష్కారం చేయగలిగినవి వెంటనే పరిష్కరించాలని, మిగిలినవి జిల్లా అధికారుల దృష్టిలో ఉంచి, వాటి ప్రక్రియ సరిగా జరిగే విధంగా చూడవలసిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కూడా కాపాడాలన్నారు. కార్యాలయం సిబ్బంది పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎంఎల్ఎ, బాధితుల నుండి వివరాలను సేకరించి వాటి పరిష్కార మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలం పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలకు ఇవతల ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలు పైబడిన ఓ వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని పరిశీలించి ఈ వ్యక్తి చనిపోయి సుమారు 10 రోజులుపైగా అయి ఉంటుందని, ఈ కారణంగా ఈ బాడీ మొత్తం డీకంపోజ్ అయిందన్నారు. ఈ మేరకు శవపంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

ప్రజాశక్తి-సీతారామపురం

మండల కేంద్రమైన సీతారాంపురం లోని మారంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పనులు గురించి ఎపిడి.శంకర్ నారాయణ మోడీ, డి.వి.ఒ. (జిల్లా విజిలెన్స్ ఆఫీసర్), ఎంపిడిఒ భాస్కర్ తనిఖీలు చేపట్టారు. పంచాయతీ లో జరిగిన పనుల గురించి విచారణ చేపట్టగా ఆ గ్రామ సర్పంచ్ గాజులపల్లె చంద్రారెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పనులలో కూలీలకు రోజువారి కూలి రూ.250 వంతును వారానికి రూ.1500 వేతనం అందుతుందని, కానీ కూలీలు వేతనం వారిని బ్యాంకు దగ్గరికి పోనివ్వ కుండా ఫినో బ్యాంక్ మిషన్లో మొత్తాన్ని తీసి వారికి రూ.500 ఇచ్చి మిగిలిన మొత్తాన్ని చంద్రారెడ్డి తీసుకుంటున్నారని మారంరెడ్డి పల్లి గ్రామవాసి అయినా కలివెల ఎలీషా కుమార్, ప్రతి సోమవారం జరిగే కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. ఈ విషయమై కలెక్టర్, అధి కారుల పర్యవేక్షణలో కమిటీకి ఆదేశిం చారు. పై అధికారులు ఉపాధి హామీ కూలీలను విచారించగా కొంత మంది కూలీలను చంద్రారెడ్డికి వ్యతిరేకంగా కొంతమంది అనుకూలంగా చెప్పారన్నారు. ఈ విషయం గురించి వివరణ కోరగా ఉపాధి హామీ సిబ్బంది ఎపిఒ ఆఫీస్‌లో ఆ గ్రామ సర్పంచ్ జి.చంద్రారెడ్డి కూర్చొని ఉండే ఫోటోలు ఆ కమిటీకి ఆ గ్రామ ప్రజలు అందజేశారు. ఈ విషయంపై ఎపిఒ వివరణ ఇవ్వాల్సి ఉంది. ఏదేమైనా ఆఫీస్ సిబ్బంది ఎపిఒ బాధ్యత వహించా లని ఎపిడి శంకర్ నారాయణ మోడీ పేర్కొన్నారు. కానీ పైకమిటీ అధికారుల నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని వారికి తెలియజేశారు.

మాజీసిఎం చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి-కోవూరు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ జ్యోతిప్రభ, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కందుకూరు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కందుకూరు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరు నాగేశ్వరరావు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, సబ్ కలెక్టర్ శ్రీ పూజ తో కలిసి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఈనెల మూడవ శనివారం కందుకూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. జిల్లా సమగ్ర అభివద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కషి చేస్తున్నారని, జిల్లాలో రామాయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం, బిపిసిఎల్ రిఫైనరీ, ఇండోసోల్ సోలార్ ప్యానల్, ఫిషింగ్ హార్బర్ వంటి భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు జిల్లాలో ఏర్పాటు అవుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు మూడేళ్లలో జిల్లాకు కందుకూరు పట్టణం గేట్ వే గా మారునుందని చెప్పారు. ఈ మెగా ప్రాజెక్టుల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు కావలి, కందుకూరు పట్టణాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయని చెప్పారు. జల్ జీవన్ మెషిన్ పథకానికి కూడా 8400 కోట్లు జిల్లాకు మంజూరయ్యాయని, త్వరలోనే పథకానికి జలధారా అని పేరు పెట్టి పెద్ద ఎత్తున తాగునీటి పథకాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 300 కోట్లతో రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. జిల్లాలో పురోగతిలో ఉన్న ఈ ప్రాజెక్టుల వివరాలను కూడా ముఖ్యమంత్రికి అందించేందుకు జిల్లా యంత్రాంగం నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా అభివద్ధికి ముఖ్యమంత్రి పర్యటనను ప్రజా ప్రతినిధులు, అధికారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామసభ తరహాలోనే ముఖ్యమంత్రి సభావేదికను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల విభాగాధిపతులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో పూర్తి బాధ్యతతో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. తొలుత కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రదేశం వద్ద ముఖ్యమంత్రి సభా వేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే నాగేశ్వరరావు, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.కార్యక్రమంలో టిజిపి స్పెషల్ కలెక్టర్ శీనా నాయక్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రీసర్వేకు రైతులు తప్పక హాజరవ్వాలి

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా తగు చొరవ తీసుకోవాలని సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలో సర్వే చేస్తున్నామో మూడు రోజులు ముందుగానే ఆ ప్రాంత రైతులకు తెలియజేసి వారందరూ రీ సర్వే కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. రైతులు ఏమైనా సమస్యలు తీసుకువస్తే.. వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నిర్మలానందబాబా, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఇన్‌ఛార్జి సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐ ఎస్‌కె మునీజ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

మండలంలోని పరకండపాడు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో కరెంటు స్తంభాలు ఒరిగి ఉన్నాయి. దీంతో కరెంటు తీగలు చెయ్యి ఎత్తితే తగిలే విధంగా కిందకు జారి ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లే విధంగా ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రాణ భయంతో కాలనీలో నివసిస్తున్నామని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకున్న దాఖలాలే లేవన్నారు. ఇప్పటికైనా ప్రాణ నష్టం జరగకముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు, గ్రామ సర్పంచ్ కోరుతున్నారు. అదేవిధంగా గ్రామంలో శ్మశాన సమస్య కూడా ఉందని సంబంధిత అధికారులకు అర్జీలు ఇచ్చినప్పటికీ బుట్ట దాఖలాలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా పరకండపాడు ఎస్సీ కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలని అధికారులు వెంటనే స్పందించాలని గ్రామ సర్పంచ్ కోరుతున్నారు.

పైర్లను ధ్వంసం చేసిన భారత్ పెట్రోలియం

- అగ్రహిస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

భారత్ పెట్రోలియం సంస్థ పచ్చని పైర్లను ధ్వంసం చేయడంతో అగ్రహిస్తున్న అన్నదాతల వైనమిది. వివరాల్లోకి వెళితే...ముత్తుకూరు మండలం ఆదాని కష్ణపట్నం పోర్టు నుంచి తోటపల్లిగూడూరు మండలం మీదుగా హైదరాబాదుకు భారత్ పెట్రోలియం గ్యాస్ పైప్ లైన్ నడుపుతోంది. ఈ క్రమంలో పచ్చని పైర్లను ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆవేదనను, పరిస్థితిని కూడా పట్టించుకోకుండా, అర్థం చేసుకోకుండా వేసిన పంట పైర్లను తొక్కిస్తూ, ఇష్టం వచ్చినట్లు చేస్తున్న భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులపై పేడూరు రైతులు మండిపడుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొలాల గుండా పైప్ లైన్ ఏర్పాటుకు సమ్మతించామన్నారు. అయితే పంట చేతికి వచ్చే తరుణంలో కంపెనీ యాజమాన్యం పొలాలను తొక్కించుకుంటూ రైతాంగాన్ని నష్టపరుస్తున్నారని వారు వాపోయారు. దీనివల్ల ఒక్కో రైతులు పంట నష్టపోతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. కోతలు అయిన తర్వాత పైపులైన్ వేసుకోవాలని ప్రాధేయపడినప్పటికి భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులు ససేమీరా అంటున్నారని రైతులు తెలిపారు. ప్రస్తుతం ధాన్యానికి తగిన గిట్టుబాటు ధర లేక రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో పంట చేతికొచ్చే సమయంలో ఇలా చేయడం సమంజసం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పైప్ లైన్ ఏర్పాటుకు ఒక నెల గడువు ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



623 ఇంకుడు గుంతలు మంజూరు

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్

మండలంలోని గ్రామాలకు మొత్తం 623 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి ఈనేపథ్యంలో గ్రామాలలో నీరు ఇంకే అవకాశం లేక సైడ్ కాలువలు లేని కారణంగా రోడ్లపై మురుగు నిలిచి దోమల వ్యాప్తి వలన ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. మురుగునీరు రోడ్లపై నిలవకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని దోమల వ్యాప్తిని అరికట్టాలి. బసిరెడ్డి పాలెం, .చెంచు రెడ్డిపాలెం, .వెంకంపేట గ్రామాలలో ఇంకుడు గుంతలను ఎలా ఏర్పాటు చేయాలో అవగాహన కల్పించి మంజూరైన ఇంకుడు గుంతలు మొత్తం మండలంలోని అన్ని గ్రామాలలో రేపటికల్లా ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో అధికారుల ఆదేశాల మేరకు ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ వై వెంకటేశ్వరరావు, పీడీ గంగా భవాని,. ఏపీఓ ఎస్కె అబ్దుల్లా, ఎపిడి బాబురావు, ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అనంతరం కొత్తగా నిర్మించిన వెంకంపేటలోని గోకులం షెడ్డును పరిశీలించి అనంతరం పిడి గంగాభవాని సంతప్తిని వ్యక్తం చేశారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని హెడ్ క్వార్టర్‌లో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్న బస్టాండు షెల్టరు శిథిలావస్థకు గురై పడిపోవడంతో, అక్కడ ప్రయాణికులు నిలవడానికి స్థలం లేక షాపుల దగ్గర బస్సు కోసం పడికాపులు కాయాల్సిన పరిస్థితులు దాపురించి ఉన్నాయి. ఈ ప్రాంతం యాత్ర ప్రదేశం కావడంతో వేలాదిమంది భక్తులు ఇక్కడికి దర్గా సందర్శనార్థం వస్తూ ఉంటారు. ప్రయాణికులకు టాయిలెట్ సౌకర్యం కూడా లేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రదేశం ఉండడం గమనార్హం. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మంత్రులు, ఎంపిక కావడం, మళ్లీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వంలో కూడా మంత్రి పదవులు అనుభవించడం తప్ప ఈ ప్రాంతం పర్యాటక ప్రదేశంగా మారస్తామని మాటలు చెప్పి కాలాతీతం చేయడం తప్ప అభివృద్ధి దిశగా అడుగులు వేసిన పాపాన పోలేదని ఇక్కడ గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడకు వచ్చే భక్తుల ద్వారా పన్నులు వసూలు చేయడం తప్ప వారికి మెరుగైన వసతులు కల్పించడంలో, శ్రద్ధ వహించడం లేదని, కనీసం బస్సు తిప్పుకోవడానికి కూడా స్థలం లేక ఊరి బయట ప్రయివేట్ స్థలాల్లో తిప్పుకొని వస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ఇకనైనా ఈ విషయాన్ని జిల్లా అధికారులు నాయకులు గమనించి దర్గాకు వచ్చే యాత్రికులకు మెరుగైన వస్తువులు కల్పించాలని, బస్టాండ్ నిర్మించాలని, ఇక్కడి గ్రామస్తులు యాత్రికులు కోరుతున్నారు.

'భూ ఆధార్'పై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిట్రగుంట గ్రామంలో భూ ఆధార్ పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ భూఆధార్ పొందేందుకు పంచాయతీలోని మండల వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు తమ ఆధార్ లింక్ అయినా ఫోన్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఇతర వ్యవసాయ సంబంధించిన సబ్సిడీలను రైతులు పొందవచ్చని తెలిపారు. బోగోలు మండలంలోని రైతులు భూఆధార్ పొందేందుకు మండల వ్యవసాయ కార్యాలయంలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-బిట్రగుంట : నెల్లూరు నుండి చిన్నగంజా వెళ తుండగా కోవూరుపల్లి ఫ్లై ఓవర్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో కట్ట నాగరాజు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బిట్రగుంట పోలీసుల వివరాల మేరకు.. చినగంజంకు చెందిన కట్ట నాగరాజుకు భార్య ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు. జీవనోపాధి కోసం నెల్లూరుకి వచ్చి తిరిగి బైక్ కూతురిని తీసుకొని వెళ తుండగా కోవూరుపల్లి ఫ్లైఓవర్ దగ్గర యాక్సిడెంట్ కావడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడని, నాగరాజు శవాన్ని కావలి మార్చరికి తరలించామని, కూతురుకి బలమైన గాయాలు కావడంతో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు చేవూరు జెడిపిహెచ్ స్కూల్లో శుక్రవారం పోషణ బి పడాయి బి ట్రైనింగ్ క్లాసులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అరుణ పాల్గొన్నారు. కార్యకర్తలకు పోషణభి పడాయి బి గురించి తెలియపరిచారు. ఆమె మాట్లాడుతూ సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ గురించి తెలియజేశారు. పిల్లలను పుట్టినప్పటినుంచి జాగ్రత్తగా పోషణ తో కాపాడాలన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆర్నెల్ల వరకు తల్లిపాలు ఇప్పించాలన్నారు. ఏడవ నెల నుంచి తల్లిపాలు ఇస్తూ పెద్దలు తినే అన్ని రకాల ఆహారాలు బిడ్డకు పెట్టవలెనని తెలియపరిచారు. బిడ్డలను ఎత్తు బరువు చూసి పోషణ తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని సంరక్షించడానికి తల్లికి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిసి సూపర్‌వైజర్ కామేశ్వరి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రాక్టికల్స్ మాస్‌కాపింగ్


నినాదాలు చేస్తున్న విద్యార్థి నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నెల్లూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రభుత్వం నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇదే అదునుగా కొన్ని కార్పొరేట్, ప్రవేట్ కళాశాల యాజమాన్యం వారు విద్యార్థుల వద్ద నుండి ప్రాక్టికల్ ఫీజుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేసుకున్నారు. తల్లిదండ్రుల మాంసపు ముద్దల శ్రమను దోచుకుని తింటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించమని జిల్లా ఆర్ఐఒకు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ఏనాడు విచారణ చేసిన పాపాను పోలేదని తెలిపారు. సరైన రసీదులు ఇవ్వకుండా డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని కళాశాల యాజమాన్యాలను ప్రశ్నిస్తే వచ్చిన ఇన్విజిలేటర్లకు ఇవ్వాలని లేకపోతే వారు మా తమ విద్యార్థులకు మార్కులు వేయరని అందుకే వసూలు చేస్తున్నామని వారు తెలపడం జరిగిందన్నారు.పరీక్ష మొదలైన వెంటనే మైక్రో జెరాక్సు విద్యార్థులకు అందించి సీసీ కెమెరాలు సాక్షిగా పరీక్షలు రాయిస్తున్నారని తెలిపారు. ఆర్.ఏ.ఓ గారు తనిఖీల పేరుతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి వారి సమక్షంలో ఆర్ ఐ ఓ ఆ కళాశాల ఫుటేజ్ లు పరిశీలించి మాస్ కాపింకు పాల్పడినటువంటి కళాశాలలు గుర్తింపులు రద్దుచేసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు పవన్ కిషోర్,నగర అధ్యక్ష కార్యదర్శులు హనీష్, శివం వర్మ, కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు వైభవ్, ఏఐఎస్ఎఫ్ నగర, రూరల్, కోవూరు నాయకులు సుధీర్, శరన్, సుమంత్,సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.